క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



స్వామివారికి హారతి పడుతున్న భక్తురాలు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. భూదేవి, అలివేలిమంగమ్మ సమేత కోనా వేంకటేశ్వర స్వామివారి మూల విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. స్థానికులతోపాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల తదితర తదితర గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్ల నుదర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి తిమ్మన్న

సి.బెళగల్: విద్యారంగ సమస్యల పరిష్కారమే యూటీఎఫ్ లక్ష్యమని ఆ సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మన్న పేర్కొన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలలో భాగంగా మండల కేంద్రం సి.బెళగల్లోని పాత పంచాయతీ కార్యాలయ యూనియన్ నాయకులతో కలిసి ఆయన ఆవరణలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిమ్మన్న మాట్లాడుతూ టీచర్ల సమస్యలను ఎప్పటికి అప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు యూటీఎఫ్ ముందు ఉంటుందన్నారు. కార్యాక్రమంలో యూటీఎఫ్ నాయకులు కిషోర్‌కుమార్, కాంతరావు, హనుమన్న, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బస్సు



బ్రిడ్జిపై నిలచిపోయిన వాహనాలు

పాణ్యం: మండల పరిధిలోని గోనవరం గ్రామ సమీపంలో ఉన్న బ్రిడ్జిపై శనివారం రోడ్డు ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. బ్రిడ్జికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. తాడిపత్రి డిపో ఆర్టీసీ బస్సు నంద్యాల నుంచి వెళ్తుంగా బ్రిడ్జిపై ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. దీంతో అక్కడే రెండు వాహనాలు నిలిచిపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

నాటుసారా స్వాధీనం



పట్టుబడిన నాటుసారాను చూపుతున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని క్రిష్ణగిరి మండలం బొంతిరాళ్లలో పోలీసులు నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. చిన్న మాదన్న అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 20లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజినేయులు శనివారం తెలిపారు. చిన్న మాదన్నపై కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరు పరిచామన్నారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ ఆలీ బేగ్, సిబ్బంది అన్సర్‌బాషా, శంకర్‌నాయక్, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ట



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: కల్లూరు అర్బన్ 35వ వార్డులోని చింతలముని నగర్‌లో శనివారం సుంకుల పరమేశ్వరి దేవాలయ ధ్వజస్తంభ ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ట్రాక్టర్ బోల్తా..యువకుడి మృతి

ఓర్వకల్లు: సోమయాజులపల్లె ఘాట్‌లో ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల జిల్లా, వడ్డేపల్లె మండలం, బుడమరుసు గ్రామానికి చెందిన ఉప్పరి తిమ్మప్ప కుమారుడు ఉప్పరి పరమేష్(35) తమ ట్రాక్టర్‌ను (నంబర్ టీఎస్ 33 యుకే 4898) బద్వేల్‌కు తీసుకెళ్తున్నాడు. సోమయాజులపల్లె ఘాట్ రోడ్డు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టరనడుపుతున్న పరమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అతనిని 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లుతుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.







నదీతీర గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులు సైతం తాగుతున్న నదీనీరు, నదీతీర గ్రామంలో నది నుంచి ఇళ్లకు నేరుగా సరఫరా అయిన ఒండునీరు, ఇళ్లకు సరఫరా అయిన తాగునీటిని చూపుతున్న మహిళ

తుంగ చెంత... నీటి చింత!

- తుంగభద్ర నదీతీర ప్రాంత ప్రజలకు తప్పని తాగునీటి ఇక్కట్లు
- ఒండ్రునీరే తాగాల్సిన దుస్థితి
- అనారోగ్యానికి గురువుతున్న ప్రజలు
- ఆ పల్లెల ప్రజల కలగానే శుద్ధ జలం



సంగాల గ్రామం దగ్గర తుంగభద్ర నదిలో పారుతున్న ఒండునీరు

సి.బెళగల్: తుంగభద్ర నదీతీర గ్రామాల ప్రజలు తాగునీటి సమస్యలు తప్పడం లేదు. చెంతనే తుంగభద్ర నది ఉన్నా మంచినీటి చింత తీరడం లేదు. ఒండ్రునీటిని తాగుతూ ఆయా గ్రామాల ప్రజలు అనారోగ్యానికి గురువుతున్నారు. సి.బెళగల్ మండల పరిధిలోని నదీతీరంలో తిమ్మందొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్‌దొడ్డి, కొత్తకోట గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలను సమీన చింతమానుపల్లె, పలుకుదొడ్డి, ఈనగండ్ల, పోలకల్ ఉన్నాయి. అంటే సగానికి సగం గ్రామాలు తుంగతీరాన ఉన్నాయి. నది నుంచి ఆయా గ్రామాల ట్యాంక్‌లకు నీరు డైరెక్ట్‌గా సరఫరా చేస్తున్నారు. కలుషిత నీరే తాగాల్సిన పరిస్థితి నెలకొంది. తప్పని పరిస్థితుల్లో నది నుంచి డైరెక్ట్‌గా సరఫరా అయిన ఒండ్రు నీటిని తాగుతూ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఒండ్రు నీరు తాగిన ప్రజలు అనారోగ్యానికి గురైన సందర్భాలు లేకపోలేదు. ఆ గ్రామాల ప్రజలకు శుద్ధజలం కలగానే మిగిలిపోతుంది.

ఏ కాలమైనా మంచినీటి తిప్పలే....

మంచినీటి సమస్యలు సాధారణంగా వేసవిలో చూస్తుంటాం. అయితే తుంగనదీతీర గ్రామాల ప్రజలకు వేసవే కాదు, వర్షాకాలంలోనూ మంచినీటి తిప్పలు తప్పవు. వేసవిలో పరిస్థితి మరీ ధారుణంగా ఉంటాయి నీటి కష్టాలు. నదిలోని గుంతలలో నిల్వనీటిని, రంగుమారిన నీరు తాగాల్సిన దుస్థితి నెలకొంది. అదేవిధంగా వర్షాకాలంలోనూ సమస్యలు తప్పడం లేదు. విస్తారంగా వానలు కురిసినప్పుడు నదికి వచ్చే వరదనీటితో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఒండ్రు నీటిని నేరుగా సరఫరా చేస్తుండడంతో తప్పని పరిస్థితులో ఈ నీటినే తాగాల్సిన దుస్థితి నెలకొంది.

విద్యార్థులకు సైతం తప్పని ఇబ్బందులు

తుంగనదీతీర గ్రామాలలోని విద్యార్థులకు సైతం మంచినీటి ఇబ్బందులు తప్పడంలేదు. ఈ గ్రామాలలో 11 ప్రాథమిక, రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల కలిపి మొత్తం 14 స్కూళ్లు ఉన్నాయి. పాఠశాలలకు ఆయా గ్రామ పంచాయతీల నుంచి తాగేందుకు నదీనీరు సరఫరా అవుతున్నాయి. విద్యార్థులకు సైతం ఒండునీరే తాగాల్సిన దుస్థితి నెలకొంది. ఈ నీరు తాగడానికి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పది ఫిల్లర్ వాటర్ ప్లాంట్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంచినీటి ఇక్కట్ల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంది. మాజీ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి రూ.కోటి కేటాయించి పది గ్రామాలలో ఫిల్టర్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. నదీతీర గ్రామాలైన కె.సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల గ్రామాలతో పాటు సమీప గ్రామాలైన మండల కేంద్రం సి.బెళగల్, చింతమానుపల్లె, పలుకుదొడ్డి, బ్రాహ్మణదొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాల్లో ఒక్కో ప్లాంట్‌కు రూ.10 లక్షలు వెచ్చించి ఫిల్టర్ వాటర్ ప్లాంట్ల నిర్మించి శుద్ధ జలం సరఫరా చేయించారు. బురాన్‌దొడ్డి, మారందొడ్డి గ్రామాల్లో ఫిల్టర్ వాటర్ ప్లాంట్లు నిర్మాణ దశలో ఉన్నాయి. పెండింగ్ ఉన్నవాటితో పాటు అన్ని గ్రామాల్లో ఫిల్టర్ వాటర్ ప్లాంట్లు నిర్మించి శుద్ధ జలాన్ని అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఫిల్లర్ వాటర్ ప్లాంట్ నిర్మించాలని కోరాం



కొన్ని గ్రామాలలో మాత్రమే ఫిల్టర్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. అన్ని నదీతీర గ్రామాల్లో ఫిల్టర్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పంచాయతీ తీర్మానం కూడా చేశాం. మా గ్రామం సంగాలలో మంచినీటి సమస్య ఉంది. ఉన్నతాధికారులు స్పందించి ప్లాంట్‌లు ఏర్పాటు చేయించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలి.

– హనుమంతు, సంగాల గ్రామ సర్పంచ్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



తుంగభద్ర నది నుంచి కొన్ని గ్రామాలకు నదీనీరు సరఫరా అవుతుంది. నదికి వరద వచ్చినప్పుడు, వర్షాలు కురిసినప్పుడు ఇబ్బందికరంగా ఉంటుంది. ఇప్పటికే మూడు నదీతీర గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశాం. ప్రజల నీటి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తున్నాం.

– గోనేనాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, సి.బెళగల్

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం
అమానుషం

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: విజయవాడలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఖండించారు. ఈ మేరకు శనివారం కల్లూరులోని ఇందిరమ్మ కట్ట వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆయన బడుగు, బలహీన వర్గాలతో కలిసి పాలాభిషేకం చేసి, కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శిలాఫలకాలను ధ్వంసం చేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. చివరికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై కూడా దాడి చేశారంటే శాంతిభద్రతలు ఏ విధంగా ఉన్నాయో అర్థం అవుతుందన్నారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, తిరుగుబాటు చవిచూస్తారని హెచ్చరించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక, పథకాల అమలు చేయాలని ప్రజలు రోడ్లపైకి రాకుండా భయభ్రాంతులకు గురిచేసేందుకే అధికార పార్టీ నాయకులు ఇలాంటి హింసా ఘటనలకు పాల్పడుతున్నారన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కార్యాలయాలకు పార్టీ రంగులు వేస్తున్నారంటూ గగ్గోలు పెట్టి.. ఇప్పుడు అన్న క్యాంటీన్లకు, కార్యాలయాలకు పసుపు రంగు ఎలా వేస్తారని ప్రశ్నించారు. పగలు, ప్రతీకారాలు పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నరసింహులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, శ్వేతారెడ్డి, డీఏఏబీ మాజీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఎ.హనుమంతు రెడ్డి, నాయకులు రంగప్ప, శ్రీనివాసులు యాదవ్, తిరుపాల్, భాస్కర్‌రెడ్డి, శివశంకర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయించండి



మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ప్రాగనంలో తాము అధికారంలో ఉన్నప్పుడు దాదాపు రూ. 2కట్లోతో అభివృద్ధి పనులు చేపట్టామని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, వెంటనే ప్రారంభించి పూర్తి చేయించాలని ఆలయ అధికారులకు కాటసాని సూచించారు. కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని శనివారం మాజీ ఎమ్మెల్యే కాటసాని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రసిద్ధిగాంచిన స్వామిగా వెలగొందుతున్న శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేశామన్నారు. ముఖ్యంగా భక్తుల విడిది గదులు, ప్రత్యేక క్యూలైన్, షెడ్డు తదితర వాటి పనులు చేపట్టామన్నారు. అయితే ప్రస్తుతం అభివృద్ధి పనులు నిలిపివేయడం సమంజసం కాదని, వీటిని పూర్తి చేయించాలని ఆలయ అధికారులకు సూచించారు. గ్రామ సర్పంచ్ బీరం రాజేశ్వరమ్మ కుమారుడి వివాహానికి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, అర్చకులు నారాయణస్వామి, సురేష్‌స్వామి, వీరయ్యస్వామి, భాస్కర్‌రెడ్డి, శివరామిరెడ్డి, గగ్గటూరు శ్రీనివాసరెడ్డి, వడ్డుగండ్ల రాముడు, పుల్లయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారు వ్యాపారి కిడ్నాప్ నిందితుల అరెస్ట్

- కేసును ఛేదించిన పోలీసులకు రివార్డు అందించిన సీఐ మన్సురుద్దీన్



బంగారు వ్యాపారి కేసులో ప్రధాన నిందితుల అరెస్ట్‌ను చూపుతున్న కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, ఎస్‌ఐ హనుమంతప్ప

కోడుమూరు రూరల్: గూడూరులో బంగారు వ్యాపారి డమామ్ వెంకటేష్ కిడ్నాప్ కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ తెలిపారు. గూడూరు బంగారు వ్యాపారి కిడ్నాప్ కేసు, పులకుర్తిలో మహిళ హత్య కేసులకు సంబంధించిన నిందితుల అరెస్ట్ వివరాలను శనివారం సాయంత్రం కోడుమూరు పోలీస్ స్టేషన్‌లో సీఐ మన్సురుద్దీన్ విలేకరులకు వివరించారు. బంగారు వ్యాపారి డమామ్ వెంకటేష్‌ను డబ్బు కోసం పులకుర్తికి చెందిన గొల్ల వీరేష్, పాన్నకల్ చెందిన బోయ కొండయ్య, పెద్దపాడుకు చెందిన గాండ్ల నరసింహులు, కటిక మహబూబ్‌బాషా కలిసి జూలై 29న స్కార్పియోలో గూడూరులో కిడ్నాప్ చేసుకుని వెళ్లారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి అదేరోజు అర్ధరాత్రి ప్యాలకుర్తి, చనుగొండ్ల గ్రామాల మధ్య పొలాల రస్తాలో ట్రేస్ చేసి పట్టుకున్నారు. అయితే నిందితులు వాహనాన్ని, కిడ్నాప్ చేసిన డమామ్ వెంకటేష్‌ను వదిలేసి పారిపోయారు. అయితే ఆగష్టు1న బోయ కొండయ్య, గాండ్ల నరసింహులును అరెస్ట్ చేయగా, పరారీ ఉన్న ప్రధాన నిందితుడు పులకుర్తికి చెందిన గొల్ల వీరేష్‌తో పాటు మరో నిందితుడు కటిక మహబూబ్‌బాషాను శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు. అయితే కిడ్నాప్ కేసులో సహకరించిన వ్యక్తుల కోసం కూడా ఇంకా గాలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో గూడూరు ఎస్‌ఐ హనుమంతప్ప ఉన్నారు.

కానిస్టేబుళ్లకు రివార్డు

బంగారు వ్యాపారి కిడ్నాప్ కేసును 6గంటల్లోనే ఛేధించిన గూడూరు ఎస్‌ఐ హనుమంతప్ప, సిబ్బందిని సీఐ మన్సురుద్దీన్ అభినందించారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్ల ప్రదీప్, లోకేష్, శ్రీరామ్, మధు మోహన్‌కు నగదు రివార్డును సైతం సీఐ అందజేశారు.

భార్యను చంపిన కేసులో నిందితుడి అరెస్ట్

మండలంలోని పులకుర్తి గ్రామంలో మద్యం మత్తులో కట్టుకున్న భార్యను రోకలితో కొట్టి చంపిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు శనివారం కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. కోడుమూరు మండలం పులకుర్తికి చెందిన బోయ మల్లీశ్వరీ(28)ని పదేళ్ల కిందట కల్లూరు మండలం బస్తిపాడుకు చెందిన రంగడుకు ఇచ్చి వివాహం చేశారు. రంగడు మద్యానికి బానిసై వేధింపులకు పాల్పడుతుండడంతో ఆమె పుట్టినిల్లు పులకుర్తిలో తల్లిదండ్రుల వద్ద ఉండేది. ఈ నేపథ్యంలో గత జూలై 31న రాత్రి మల్లీశ్వరీ తల్లి లక్ష్మమ్మతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా, తాగి వచ్చిన రంగడు మద్యం మత్తులో భార్య, అత్తపై రోకలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన మల్లీశ్వరీ, లక్ష్మమ్మను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మల్లీశ్వరీ ఈనెల 3న మృతి చెందింది. పరారీలో ఉన్న రంగడును ఎస్‌ఐ బాలనరసింహులు తన సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారని సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌ఐ బాలనరసింహులు ఉన్నారు.



భార్యను చంపిన కేసులో నిందితుడి అరెస్ట్‌ను చూపుతున్న కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, ఎస్‌ఐ బాలనరసింహులు

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: కేరళలోని వయనాడ్ జిల్లా వరద బాధితుల కోసం సీపీఎం నాయకులు శనివారం కోడుమూరులో విరాళాలు సేకరించారు. సీపీఎం మండల కార్యదర్శి గఫూర్‌మియ్యా ఆధ్వర్యంలో నాయకులు వీరన్న, మద్దిలేటి, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్న దాతల నుంచి రూ.10,350 సేకరించారు. కార్యక్రమంలో స్థానిక సీపీఎం నాయకులు మునిస్వామి, బుడ్డప్ప, శంకర్, బాబు, గిడ్డయ్య, మధు, మల్లి పాల్గొన్నారు.

గూడూరులో....

మండల కేంద్రం గూడూరులోనూ శనివారం కేరళ వరద బాధితుల కోసం సీపీఎం మండల కార్యదర్శి మోహన్ ఆధ్వర్యంలో నాయకులు రూ.9,141 విరాళాలను సేకరించి పంపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కాంతారావు, సీపీఎం స్థానిక నాయకులు వెంకటేశ్వర్లు, మునెప్ప, రాజశేఖర్, దానమన్న, మద్దిలేటి, సోమలింగడు, మధు పాల్గొన్నారు.

వృథాగా... మినరల్ వాటర్ ప్లాంట్!



మినరల్ ప్లాంట్ మూతపడిన దృశ్యం

ఓర్వకల్లు: సమస్య ఏదైనా మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో నిర్మించిన శుద్ధజల ప్లాంట్ వృథాగా దర్శనమిస్తుంది. దీంతో ప్లాంట్ ఉన్న ప్రయోజనం సున్నా అన్నట్లుగా ఉంది పరిస్థితి. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో సంతగేటులో మినరల్ ప్లాంట్‌ను నిర్మించారు. ప్లాంటు ప్రారంభోత్సవానికి అప్పటి ప్రతిపక్ష ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే గౌరు చరితను ఆహ్వానించలేదు. గ్రామ నాయకుడు అప్పటి జెడ్పీ చైర్మన్ మల్లెల రాజశేఖర్ చేతుల మీదుగా ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆ రోజుల్లో ఎన్‌టీఆర్ సుజల పథకం కింద ప్రతి పంచాయతీకి ఒక యూనిట్‌ను మంజూరు చేస్తామని చెప్పి, కేవలం రెండు మూడు గ్రామాలకు మాత్రమే పరిమితం చేసి చేతులు దులుపుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. హుసేనాపురంలో నిర్మించిన ప్లాంట్ ప్రారంభంలో 20 లీటర్ల క్యాన్‌ను రెండురూపాయలకే అందించారు. కొద్ది రోజుల తర్వాత నిర్వహణ ఖర్చులు అంటూ క్యాన్ ధర రూ.5 పెంచారు. అప్పట్లో ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్లులేక పోవడంతో గ్రామ పంచాయతీ మినరల్ నీటికి మంచి డిమాండ్ ఉండేది. అనంతరం పూర్తిగా మూతపడింది. 2019లో అధికారంలోని వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాయకులు ప్లాంట్ తెరచినప్పటికీ మళ్లీ మొదటికి వచ్చింది సమస్య. ఏళ్లతరబడి ప్లాంట్ మూతపడడం, నీరు నాణ్యతగా లేదనే ఆరోపణల నేపథ్యం, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం అంటూ పలు కారణాలు. ఈ పరిస్థితుల్లో ఇళ్ల వద్దకే ఆటో ద్వారా మినరల్ నీటిని సరఫరా చేయడంతో గ్రామ పంచాయతీ ప్లాంట్‌కు ప్రజాధరణ తగ్గడంతో మూసివేసినట్లు కొందరు చెబుతున్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్లాంట్ సమస్యను పట్టించుకోని తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరువ తీసుకుని ప్లాంట్‌ను అందుబాటులోకి హుసేనాపురం ప్రజలు కోరుతున్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ సమీపంలో ఉన్న ఏపీ గురుకుల పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపా ల్ ప్రసాద్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆకర్ష్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సంయమ–24' కార్యక్రమానికి పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ముఖ్య అతి థిగా హాజరవుతారన్నా రు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు తప్పక హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి

కల్లూరు: పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ ప్రసిడెంట్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి ప్రసాద్ కోరారు. ఈ మేరకు శనివారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని క్యాంపు కార్యాలయంలో యూటీఎఫ్ నాయకులు కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రీప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతులను ఒకే పాఠశాలగా నడపాలని కోరారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్ ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జీఓ 117 రద్దు చేసి, జీఓ ఎంఎస్ నం 53 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని విన్నవించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ పనుల నుంచి మినహాయించి పని భారం తగ్గించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, నరహరి, విజయ్‌కుమార్, చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీ క్యాబిన్‌లో మంటలు!



ప్రమాదానికి గురైన లారీ

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద లారీ క్యాబిన్‌లో మంటలు రేగాయి. డ్రైవర్ చాకచక్యంగా కిందకు దూకాడు. దీంతో క్యాబిన్ పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహ్మద్‌కు చెందిన ఏపీ 21టీ 4818 నంబర్ లారీ పెద్దటేకూరు రైస్ మిల్లు నుంచి బియ్యం నూకలతో నంద్యాల ఎస్‌పీవై రెడ్డి లిక్కర్ ఫ్యాక్టరీకి తీసుకెళ్తున్నారు. మార్గమధ్యంలో ఓర్వకల్లు విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు రాగానే సాంకేతిక లోపం రావడంతో లారీ డ్రైవర్ రామకృష్ణారెడ్డి రోడ్డు ప్రక్కన నిలబెట్టాడు. సెల్ఫ్ మోటార్‌ను పదేపదే ఆన్‌చేయడంతో ఒక్కసారిగా ఇంజిన్ నుంచి పొగలు వచ్చాయి. దీంతో డ్రైవర్ చాకచకంగా కిందకు దూకాడు. ఈ లోగ మంటలు చెలరేగాయి. కర్నూలు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడంతో ఆర్థిక నష్టం జరుగలేదు. అయితే ఎవ్వరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని హెడ్ కానిస్టేబుల్ వీరారెడ్డి తెలిపారు.